క్లుప్తంగా

24న ఉచిత ఖత్నా

మైదుకూరు : ఈ నెల 21న ఉచిత వడుగుల(ఖత్నా) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు మదీనా దస్తగిరి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక కడప రోడ్డు మదీనా నగర్‌లోని ఉస్మాన్ మజీద్‌లో ఈ ఖత్నా కార్యక్రమం ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 99512 27559, 95507 88788 , 99499 20186, 99664 38751 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

మొరాయించిన ఫోన్లు

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠంలో బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ సక్రమంగా పనిచేయకపోవడంతో మొబైల్ ఫోన్లు మొరాయించాయి. మండలంలో అధిక శాతం బీఎస్ఎన్ఎల్ వినియోగదారులు ఉన్నారు. రోడ్డు పనులు జరుగుతున్నా, కరెంట్ లేక పోయినా, గాలి వీచినా, బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ పనిచేయడం లేదని వినియోగదారులు వాపోతున్నారు. రెండు, మూడు రోజులపాటు నెట్‌వర్క్ పనిచేయకపోవడంతోపితర నెట్‌వర్క్‌లను ఆశ్రయిస్తున్నారు.

పదోన్నతుల తర్వాతే రేషనలైజేషన్ చేపట్టాలి

మైదుకూరు : సచివాలయ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించిన తర్వాతే రేషనలైజేషన్ చేపట్టాలని గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.పెద్ద మస్తాన్, జిల్లా కార్యదర్శి రాజారెడ్డి, మైదుకూరు అధ్యక్ష, కార్యదర్శులు రమణారెడ్డి, నరసింహప్రతాప్ డిమాండ్ చేశారు. మైదుకూరులో విలేకరులతో వారు మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగుల రేషనలైజేషన్ ప్రక్రియ అమలుపై ఉద్యోగుల్లో అయోమయం నెలకొందని వారు తెలిపారు. ఉద్యోగులందరినీ వారి మాతృశాఖకు బదిలీ చేసి, ఆయా శాఖల్లో ఖాళీలను పదోన్నతుల ద్వారా భర్తీ చేశాక, రేషనలైజేషన్ ద్వారా మిగులు ఉద్యోగులను గుర్తించాలని కోరారు.

పశువైద్య శిబిరం విజయవంతం

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలోని చౌడూరు గ్రామంలో శుక్రవారం పశువైద్య కళాశాల చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఇంటర్న్‌షిప్‌లో భాగంగా ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో 320 పశువులకు గర్భకోశ వ్యాధులు, మందగూబ శస్త్రచికిత్సలు, మరికొన్ని జబ్బులకు చికిత్స అందించారు. జీవాలకు నట్టల నివారణ మందు తాపించారు. అధిక పాల దిగుబడి, వ్యాధుల నుండి పశువులను, జీవాలను ఎలా రక్షించుకోవాలనే అంశంపై పాడి రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ ఇందిరా, డాక్టర్ జ్యోతి, అధ్యాపకులు డాక్టర్ సుమిరన్, డాక్టర్ రేవతి, డాక్టర్ విజయ్‌కుమార్, చౌడూరు ఇన్‌చార్జి పశువైద్యుడు రవీంద్రారెడ్డి, సహాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చౌడేశ్వరీదేవికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక విజయనగరం వీధిలోని చౌడేశ్వరీదేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజాకార్యక్రమాలను నిర్వహించారు. వేకువజామున అమ్మవారికి పంచామృతాభిషేకం, పూజాద్రవ్యాలతో అభిషేకాలు, అర్చనలు చేశారు. మూలవిరాట్‌ను ప్రత్యేకంగా నూతన పట్టు వస్త్రాలతో, వెండి కవచాలు, బెంగుళూరు నుంచి తెప్పించిన రంగురంగుల గజ మాలలతో అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించి కాయాకర్పూరాలను సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలను అందచేశారు.

నంది వాహనంపై ముక్తిరామలింగేశ్వరుడు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక రామేశ్వరంలోని శ్రీముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. వేకువజామున సైకత లింగానికి, రాజరాజేశ్వరి అమ్మవారికి, చండీ మాతకు విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం గంగారాజరాజేశ్వరి సమేత ముక్తిరామలింగేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి నంది వాహనంపై కొలువుదీర్చి పురవీధుల్లో శివనామస్మరణల మధ్య ఊరేగించారు. దారి వెంబడి భక్తులు కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులు ఇచ్చారు.

నేడు ఈ-వేస్ట్‌పై అవగాహన

ప్రొద్దుటూరు : స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణాంధ్రలో భాగంగా శనివారం ఈ-వేస్ట్‌పై అవగాహన, సేకరణ ప్రధానాంశంగా స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున ఒక ప్రకటనలో తెలిపారు. ఈ-వేస్ట్‌ను ఎక్కడ పడితే అక్కడ పారవేయడం పర్యావరణానికి హానికరమని ఆయన పేర్కొన్నారు. అన్న క్యాంటిన్ దగ్గర, శివాలయం ఎదురుగా, గాంధీ పార్కు దగ్గర ఈ-వేస్ట్‌ను తీసుకోవాడానికి ఈ-వేస్ట్ డబ్బాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పాడైన, పనికిరాని వాషింగ్ మిషన్లు, ఫ్రిడ్జ్‌లు, కూలర్లు, టీవీలు, ఎల్ఈడీ బల్బులు తదితర ఎలక్ట్రానిక్ వస్తువులు పురపాలక ఈ-వేస్ట్ సేకరణ సిబ్బందికి ఇచ్చి పర్యావరణాన్ని పరిరక్షించేందుకు సహకరించాలని కోరారు.

బాబోయ్ రేసర్లు.. రోడ్డెక్కాలంటే గుబులు!



సైలెన్సర్ లేకుండా రయ్.. రయ్.. ఫట్.. ఫట్‌మంటూ దడ పెట్టించే పెద్ద పెద్ద శబ్దాలు.. ఒక్క బైక్‌పైనే ముగ్గురు నలుగురు కూర్చొని స్పీడ్ డ్రైవ్‌లు.. పిచ్చి పిచ్చి అరుపులు, కేకలతో భయానక రైడ్‌లతో కుర్రకారు హోరెత్తిస్తున్నారు. రద్దీగా ఉండే రోడ్లపై కొందరు ఆకతాయిలు చేసే ప్రమాదకర స్టంట్లతో మిగతా వాహనచోదకులు హడలెత్తిపోతున్నారు. తమ పిల్లలను అదుపులో పెట్టకుండా తల్లిదండ్రులు గారాబం చేయడంతో ఇంకా రెచ్చిపోతున్నారు. పోలీసులు సైతం దృష్టి సారించకపోవడంతో వీరు చెలరేగిపోతున్నారు.

- బైకులపై పట్టణంలో కుర్రకారు హల్‌చల్
- రోడ్లపై హడలెత్తిస్తున్న మైనర్ బైక్ రైడర్లు
- ప్రాణాంతక విన్యాసాలతో స్టంట్లు
- భయాందోళనలో ప్రజలు

బద్వేలు : పట్టణంలోని రోడ్లపై కొందరు ఆకతాయిలు బైక్‌లపై విన్యాసాలు, సర్కస్ ఫీట్లు చేస్తూ పక్కన వెళ్లేవారిని పరేషాన్ చేస్తున్నారు. అధిక సామర్థ్యమున్న ద్విచక్ర వాహనాలతో రోడ్లపై హల్‌చల్ చేస్తున్నారు. సిద్దవటం రోడ్డు, మైదుకూరు నెల్లూరు ప్రధాన రహదారిలో ప్రతిరోజూ సాయంత్రం 5 గంటల సమయంలో బృందాలుగా ఏర్పడి అధిక శబ్దం చేసుకుంటూ మెరుపుతీగల్లా దూసుకెళ్తూ రోడ్లపై వెళ్లే వారిని హడలెత్తిస్తున్నారు. మరోవైపు పట్టణ శివారుల్లో విన్యాసాలు చేస్తుండటం చూసే వారికి ఒళ్లు జలదరిస్తోంది. ఒక బైక్‌పై ఇద్దరు ముగ్గురు కూర్చుని పాములా మెలికలు తిరుగుతూ.. బైక్‌పై నిలబడి చేతులు వదలి చేస్తున్న విన్యాసాలు చూసి మిగతా వాళ్లు భయపడిపోతున్నారు. ఈ ప్రమాదకర బైక్ రేసింగ్‌లో ప్రమాదానికి గురై గాయాలపాలవుతున్నారు.

వాహనాలతో సర్కస్ ఫీట్లు

ఇద్దరు వెళ్లాల్సిన బైక్‌లపై ముగ్గురు, నలుగురు కూర్చొని ప్రయాణిస్తుండడం పరిపాటిగా మారింది. ప్రమాదమని తెలిసినా పట్టించుకోవడం లేదు. ఇప్పుడదే ఫ్యాషన్‌గా మారింది. ప్రధానంగా సిద్దవటం రోడ్డుతో పాటు విశాలమైన ప్రదేశాల్లో నైట్ రైడింగ్, నైట్ రేసింగ్, స్టంట్ రైడింగ్, వంటి విన్యాసాలు చేస్తున్నారు. వీరిని అదుపు చేయాల్సిన పోలీసులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. హైస్పీడ్ స్పోర్ట్స్ బైక్‌లు కొనిచ్చిన తల్లిదండ్రులకు తమ పిల్లల బైక్ విన్యాసాలపై దృష్టి సారించడం లేదు. దీంతో ఎంతో భవిష్యత్తు ఉన్న యువకులు రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారు. బైక్ రైడర్లలో లైసెన్సు లేని వారి సంఖ్య 90 శాతానికిపైగా ఉంటుందని తెలిసి కూడా పోలీసులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

బైక్ రైడర్స్‌పై ప్రత్యేక దృష్టిసారించాలి

బద్వేలు పట్టణంలో ఉదయం ఐదు గంటలకు మొదలుకొని రాత్రి 8 గంటల వరకు రోడ్లన్నీ రద్దీగా ఉంటాయి. పలు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు వచ్చి వెళ్తుంటారు. బిజీబిజీగా ఉండే రోడ్లపై యువత చేసే బైక్ విన్యాసాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ట్రాఫిక్ సిగ్నళ్లను సైతం లెక్కచేయకుండా రయ్.. రయ్ మంటూ దూసుకెళ్తున్నారు. ఛేజింగ్ చేస్తున్న సమయంలో రైడర్లు ప్రమాదానికి గురయిన సందర్భాలు అనేకం ఉన్నాయి. పోలీసులు యువత ‘స్పీడు’కు కళ్లెం వేయాల్సి ఉంది. పోలీసు అధికారులు దృష్టిసారించి ప్రమాదాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

తల్లిండ్రులు అవగాహన కల్పించాలి



తల్లిదండ్రులు తమ పిల్లలకు ఖరీదైన హైస్పీడ్ బైక్‌లు కొనిస్తున్నామని సంతోషించడం కాదు. ముందుగా వారికి డ్రైవింగ్‌పై అవగాహన కల్పించాలి. హైస్పీడ్, అధిక సామర్థ్యమున్న బైక్‌లు మన రోడ్లపై పనికి రావు. వేగంగా పోతున్నప్పుడు వాటిని నిలువరించే శక్తి యువకులకు ఉండదు. ప్రమాదం జరిగితే ప్రాణాలు పోయే అవకాశం ఎక్కువ. అందువలన అటువంటి బైక్‌లు పిల్లలకు తల్లిదండ్రులు కొనివ్వ కూడదు. పిల్లలకు తల్లిదండ్రులు అవగాహన కల్పించాలి. – యం.నాగభూషణం, సర్కిల్ ఇన్స్‌పెక్టర్, బద్వేలు రూరల్

పెట్రోల్ పట్టే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు క్రైం : వేసవి కాలంలో పెట్రోల్ పట్టే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని అగ్నిమాపక అధికారి రఘునాథ్ తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఇండస్ట్రీయల్ ఎస్టేట్‌లోని పీవీసీ పైపుల ఫ్యాక్టరీ, కొర్రపాడు రోడ్డులోని టీవీఆర్ పెట్రోల్ బంకుల్లో పని చేసే సిబ్బందికి శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యాక్టరీల్లో 10 ఏళ్లకు ఒకసారి విద్యుత్ వైరింగ్‌ను మార్చుకోవాలన్నారు. ప్రతి యేటా ఆథరైజ్డ్ ఎలక్ట్రీషయన్‌తో వైరింగ్‌ను చెక్ చేయించుకుంటే విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరగకుండా కాపాడుకోవచ్చని తెలిపారు. అలాగే పెట్రోల్ నింపే సమయంలో సెల్‌ఫోన్లను వాడకుండా చూడాలని తెలిపారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు.

నేడు అవగాహన సదస్సు

అట్లూరు : మండల కేంద్రమైన అట్లూరు మండల సమాఖ్య కార్యాలయంలో శనివారం ఉదయం 10 గంటలకు మండల స్థాయి ప్రకృతి వ్యవసాయ అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజ తెలిపారు. వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పి.సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ సదస్సు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సదస్సుకు రైతుసేవా కేంద్రం వ్యవసాయ సహాయకులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, మండల వ్యవసాయాధికారి, గ్రామ సమాఖ్య సహాయకులు, గ్రామ సమాఖ్య ప్రతినిధులు, మహిళా రైతులు, ప్రకృతి వ్యవసాయ విధానాలు అవలంబిస్తున్న రైతులు హాజరు కావాలని ఆయన కోరారు.

భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటాం

కాశినాయన : అటవీ భూములను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని బద్వేలు ఆర్డీఓ చంద్రమోహన్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని నాయునిపల్లె రెవెన్యూ గ్రామం పరిధిలోని అటవీ భూములను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ భూములను ఆక్రమించుకుని పంటలు సాగు చేస్తున్న వారిపై చర్యలు తప్పవన్నారు. రెండు రోజుల్లో డ్రోన్ ద్వారా అటవీ భూములను సర్వే చేయించి నివేదికలు పంపాలని తహసీల్దారు వెంకటసుబ్బయ్యను ఆదేశించారు. ఆర్ఐ అమర్‌నాథ్‌రెడ్డి, సర్వేయర్లు పాల్గొన్నారు.

21న వక్ఫ్ చట్టంపై సమావేశం

మైదుకూరు : వక్ఫ్ చట్టంపై ఈ నెల 21న కడపలో వక్ఫ్‌బోర్డు సవరణ చట్టం – రాజ్యాంగ బద్ధత.. సవాళ్లు అంశంపై జరిగే రౌండ్ టేబుల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని సీపీఎం, అవాజ్ కమిటీ నాయకులు పి.చాంద్‌బాషా, ఎస్.షరీఫ్, ఎస్.ఖాదర్‌బాషా, ఎస్.బాషావలి, జహంగీర్ బాషా, అన్వర్ బాషా కోరారు. కడప రోడ్డులోని షాహి మసీదు వద్ద జరిగే రౌండ్ టేబుల్ సమావేశం కరపత్రాలను శుక్రవారం వారు ఆవిష్కరించారు.

స్థానిక యువతకు ప్రాధాన్యత ఇవ్వాలి

బద్వేలు అర్బన్ : గోపవరం మండలం పి.పి.కుంట సమీపంలోని సెంచురీ పానెల్స్ పరిశ్రమలో ఉద్యోగ అవకాశాలు కల్పించే ప్రక్రియలో స్థానిక యువతకు ప్రాధాన్యత ఇవ్వాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న పేర్కొన్నారు. శుక్రవారం సెంచురీ పానెల్స్ పరిశ్రమను సందర్శించిన ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో ఎంతో మంది నిరుద్యోగ యువత సరైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక వలసబాట పడుతున్నారని అన్నారు. పరిశ్రమ నిర్వాహకులు స్థానికంగా ఉన్న నిరుద్యోగ యువతను కాదని ఇతర రాష్ట్రాల నుండి వలస వచ్చిన వారికి అవకావం ఇస్తున్నారని తెలిపారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన



గ్యాస్ ఏజెన్సీ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న అధికారులు



పోరుమామిళ్ల : గ్యాస్ గోడౌన్‌లో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మైదుకూరు : అగ్ని ప్రమాదాలపై స్థానిక నంద్యాల, బద్వేల్ రోడ్డులోని పెట్రోల్ బంకు వద్ద అగ్నిమాపక సిబ్బంది శుక్రవారం అవగాహన కల్పించారు. ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ బి.సత్యరాజు ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాల నివారణకు సూచనలు తెలిపే కరపత్రాలను పంపిణీ చేశారు. అగ్ని ప్రమాదం జరిగినప్పుడు టోల్ ఫ్రీ నంబర్ 101కి సమాచారం ఇవ్వాలని సూచించారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

పోరుమామిళ్ల : అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా శుక్రవారం పట్టణంలోని పెట్రోల్ బంకు సిబ్బందికి, గ్యాస్ గోడౌన్‌లో పని చేస్తున్న సిబ్బందికి అవగాహన కల్పించారు. అగ్నిమాపక అధికారి నజీర్ అహమ్మద్ ఆధ్వర్యంలో పెట్రోల్ పట్టించుకునే సమయంలో సెల్ ఫోన్ వాడరాదని, అగ్ని ప్రమాదం జరిగినపుడు ఎలా జాగ్రత్తలు తీసుకోవాలో అవగాహన కల్పించారు. గ్యాస్ గోడౌన్‌లో అగ్నిప్రమాదాల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. సిబ్బంది ఓబులపతి, సుహాన్‌బాషు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పర్యావరణ వేత్త స్పందన సుబ్బరామిరెడ్డి మృతి



సుబ్బరామిరెడ్డి (ఫైల్)

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రముఖ పర్యావరణవేత్త, స్పందన స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు శెట్టిపల్లె సుబ్బరామిరెడ్డి (90) శుక్రవారం తెల్లవారుజామున కన్నుమూశారు. ఈయన చెన్నూరు చక్కెర ఫ్యాక్టరీ, ప్రొద్దుటూరు పాల కేంద్రం ఏర్పాటులో ప్రముఖ పాత్ర పోషించారు. శెట్టిపల్లె చిన్న నాగిరెడ్డి ద్వారా ఎస్‌సీఎస్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటుకు ఈయన కృషి చేశారు. రాయల నాటక కళాపరిషత్ వ్యవస్థాపక ఉపాధ్యక్షుడిగా సుబ్బరామిరెడ్డి పనిచేసి కళాకారులను ప్రోత్సహించారు. కేసీ కెనాల్ ఆయకట్టు దారుల సంఘం వ్యవస్థాపక కార్యదర్శిగా ఉంటూ రైతుల సమస్యలను పరిష్కరించారు. ప్రొద్దుటూరులో ఇండస్ట్రీయల్ ఎస్టేట్ ఏర్పాటుకు కృషి చేశారు. రోటరీ సర్వీసు కాంప్లెక్స్ ట్రస్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేసి రాయలసీమలోని పలు ప్రాంతాల్లో కంటి వైద్య శిబిరాలు నిర్వహించారు. సారా వ్యతిరేక ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. స్పందన స్వచ్ఛంద సంస్థను స్థాపించి పర్యావరణ పరిరక్షణకు విశేష కృషి చేయడంతో అదే ఆయన ఇంటి పేరుగా మారింది. ఈయన సేవలను గుర్తించిన ప్రభుత్వం పెన్నానది ఒడ్డున నర్సరీ ఏర్పాటుకు స్థలాన్ని మంజూరు చేసింది. అందులో వివిధ రకాల మొక్కలను పెంచారు. రాస్ సంస్థ కార్యవర్గ సభ్యులుగా, ఉపాధ్యక్షులుగా పనిచేసి పట్టణంలో వికాస్ విహార్ మానసిక దివ్యాంగుల పాఠశాల, అరవింద ఆశ్రమంలో అరబిందో ఇంటిగ్రల్ పాఠశాల నిర్వాహణ అధ్యక్షునిగా సేవలు అందించారు. సుబ్బరామిరెడ్డికి ముగ్గురు కుమారులు శెట్టిపల్లె సుధాకర్‌రెడ్డి, శెట్టిపల్లె రాంప్రసాద్‌రెడ్డి, శెట్టిపల్లె రవి శంకర్‌రెడ్డి, కుమార్తె వంగల సునీత శేఖర్ ఉన్నారు. ఈయన భౌతికకాయాన్ని సందర్శించి ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రాచమల్లు శివప్రసాదరెడ్డి, శెట్టిపల్లె రఘురామిరెడ్డి, వీరశివారెడ్డి, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి, టీటీడీ బోర్డు పాలకమండలి మాజీ సభ్యులు చిప్పగిరి ప్రసాద్, టంగుటూరు మారుతిప్రసాద్ తదితరులు పూలమాల వేసి నివాళి అర్పించారు.

లక్ష్య సాధనకు శ్రమించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

బద్వేలు అర్బన్ : ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని దానిని సాధించేందుకు అహర్నిశలు శ్రమించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అపుస్మా జిల్లా చైర్మన్ ఎం.వి.రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని భాష్యం స్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన వార్షికోత్సవ వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలానుగుణంగా విద్యావ్యవస్థలో, బోధనలో మెళకువలు పాటించి విద్యార్థులను ఉన్నతస్థాయికి తీసుకురావాలని కోరారు. మన్యం జిల్లా పార్వతీపురం ఎస్పీ మాధవరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుండే క్రమశిక్షణ, పెద్దలను గౌరవించడం వంటివి నేర్చుకోవాలని, తద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని తెలిపారు. అనంతరం విద్యార్థులచే ప్రదర్శించబడిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అలాగే ముఖ్య అతిథులను పాఠశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి, అర్బన్ సీఐ రాజగోపాల్, ఎంఈఓ చెన్నయ్య, భాష్యం స్కూల్ కరస్పాండెంట్ వెంకటసుబ్బారెడ్డి, ప్రిన్సిపల్ రహమతుల్లా, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి పరామర్శ



ఖాజావలి కుటుంబంతో ఎమ్మెల్సీ, నాయకులు

పోరుమామిళ్ల : వైఎస్సార్‌సీపీ కార్యకర్త, జగనన్న వీరాభిమాని గొడుగు ఖాజావలి ప్రమాదంలో మృతి చెందడం పార్టీకి తీరని లోటని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పేర్కొన్నారు. పుల్లివీడుకు చెందిన ఖాజావలి ఇటీవల రోడ్డు ప్రమాదంలో చనిపోగా శుక్రవారం ఆయన కుటుంబాన్ని ఎమ్మెల్సీ గోవిందరెడ్డి పరామర్శించారు. ఆయన వెంట రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు నాగార్జునరెడ్డి, నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త రమణారెడ్డి, జిల్లా ఆర్గనైజేషనల్ సెక్రటరి రాళ్లపల్లె నరసింహులు ఉన్నారు. ఖాజావలి కుటుంబం పేదరికంలో ఉందని, పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక రూ. 4 లక్షలు అప్పయిందని స్థానికులు ఎమ్మెల్సీతో చెప్పారు. ఖాజావలికి ఇద్దరు మైనర్ పిల్లలున్నారని, రేకులషెడ్డులో నివసిస్తున్నారని వివరించారు. ఖాజావలి మృతితో ఆ కుటుంబం అనాధగా మారిందన్నారు. ఖాజావలి కుటుంబ పరిస్థితి స్వయంగా గమనించిన ఎమ్మెల్సీ మాట్లాడుతూ పార్టీ ద్వారా ఆర్థిక సహాయం అందిస్తామని, మీకు అన్ని విధాల అండగా ఉంటామని చెప్పారు.

క్రీస్తు సందేశం.. ప్రేమ మార్గం



కలసపాడు : చెన్నారెడ్డిపల్లె ఆర్సీఎం చర్చిలో శిలువయాగం చేస్తున్న విశ్వాసులు



ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు (ఇన్‌సెట్) మాట్లాడుతున్న జాకోబ్‌ఫ్రాంక్



కలసపాడు : ప్రార్థనలలో పాల్గొన్న విశ్వాసులు (ఇన్‌సెట్) దైవ సందేశమిస్తున్న ఆనంద్‌బాబు



పోరుమామిళ్ల : గుడ్‌ఫ్రైడే సందేశ మిస్తున్న పాస్టర్ అనిల్ కుమార్



రాజుపాలెంలో ఏసు శిలువ, వేషధారణలో యువకులు



కాశినాయన : అమగంపల్లె చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

ప్రొద్దుటూరు కల్చరల్ : ఏసుక్రీస్తు ఆచరించి చూపిన ప్రేమ, కరుణ, దయ, శాంతి, సామరస్యాలు అనుసరణీమని రెవరెండ్ డాక్టర్ ఎం.జాకోబ్ ఫ్రాంక్ అన్నారు. గుడ్ ఫ్రైడే పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక రామేశ్వరంలోని సీఎస్ఐ చర్చితో పాటు పట్టణంలోని పలు చర్చిల్లో క్రైస్తవులు, విశ్వాసులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్థానిక గోకుల్ నగర్‌లోని ఎస్‌పీజీ-2 చర్చిలో రెవరెండ్ కోలాటి రాజు గుడ్‌ఫ్రైడే సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రీస్తు శిలువపై ఉన్నప్పుడు మానవాళి కోసం చెప్పిన 7 మాటలను వివరించారు. మానవాళి ప్రేమ, కరుణ, శత్రువుల పట్ల క్షమ, సహనం, త్యాగం కలిగి ఉండాలని చెప్పారు. ఏసుక్రీస్తు త్యాగానికి గుర్తుగా అందరం గుడ్ ఫ్రైడేని జరుపుకొంటామన్నారు. ప్రభువు ఆజ్ఞలను చిత్తశుద్ధితో పాటించి ఆయనకు నచ్చే విధంగా శాంతియుతంగా జీవించాలన్నారు. అలాగే మైదుకూరు రోడ్డులోని ఎస్పీజీ-1, వైఎంఆర్ కాలనీలోని సీఎస్ఐ గోల్డన్ జూబ్లీ చర్చి, ఎస్పీజీ-3 పాటు పలు చర్చిలలో గుడ్‌ఫ్రైడే సందర్భంగా క్రైస్తవులు, విశ్వాసులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు

రాజుపాళెం : మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలను క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. రాజుపాళెం, తొండలదిన్నె గ్రామాల్లో కొంతమంది యువకులు వివిధ రకాల వేషధారణలు వేశారు. ఏసు శివువను ఎత్తుకొని వీధుల్లో తిరిగారు. రాజుపాళెం ఎస్సీ కాలనీలో ఉన్న చర్చిలో ఫాస్టర్లు సీమారాణి, అనిల్, మిగతా గ్రామాల్లోని చర్చిల్లో ఫాస్టర్లు సందేశం ఇచ్చారు. సాయంత్రం వేళల్లో పిల్లలకు ఆటలపోటీలు నిర్వహించారు.

క్రీస్తు జీవితం అనుసరణీయం

బద్వేలు అర్బన్ : యేసుక్రీస్తు జీవితం అనుసరణీయమని, ప్రజల పాపాలను మోసి వారికి ఉత్తమ జీవితం అందించేందుకు ఆయన సాగించిన మార్గాన్ని కొనసాగించాలని ఆయా చర్చిల విచారణ గురువులు సందేశం ఇచ్చారు. శుక్రవారం గుడ్‌ఫ్రైడే సందర్భంగా పట్టణంలోని ఫాతిమా మాత, సీఎస్ఐ, మదర్‌థెరిస్సా, బెతెస్థ, హోసన్నా, మార్తోమా, సుందరయ్య కాలనీ బ్లెస్సింగ్ ప్రార్థనా మందిరాలతో పాటు వీరప్పల్లె పంచాయతీ కొత్త చెరువులోని పురాతన ప్రార్థనా మందిరంలో క్రైస్తవ సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాతిమామాత చర్చి సంఘస్తుల ఆధ్వర్యంలో స్థానిక మదర్‌థెరిస్సా చర్చి నుండి ఫాతిమా మాత చర్చి వరకు పరిశుద్ధ శిలువమార్గం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాతిమామాత పుణ్యక్షేత్రం విచారణ గురువులు ఫాదర్ లక్కినేని ఆరోగ్యరాజు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల పాపాలకు పరిహారం చెల్లించేందుకు క్రీస్తు తన జీవితాన్నే త్యాగం చేశారని పేర్కొన్నారు. అలాగే మదర్‌థెరిస్సా చర్చి సంఘస్తులు స్థానిక భాకరాపేట సమీపంలోని కల్వరి కొండపై ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అలాగే సీఎస్ఐ చర్చిలో నిర్వహించిన ప్రార్థనల్లో ఆ చర్చి ప్రెస్బిటర్ రెవ. స్వరాజ్ జీవన్ బాబు మాట్లాడుతూ క్రీస్తు తన బోధనల ద్వారా మానవులలో శాంతి, సమాధానం, ప్రేమ నెలకొల్పారన్నారు. అలాగే యేసు శిలువపై పలికిన 7 మాటలను విశ్వాసులకు బోధించారు. ఈ సందర్భంగా ఆయా చర్చిల్లో జరిగిన ఊరేగింపులలో క్రైస్తవులు భక్తి గీతాలు, దేవుని స్తోత్రాలతో ముందుకు సాగారు. కార్యక్రమాల్లో ఆయా చర్చిల గురువులు, ఉపదేశకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గుడ్‌ఫ్రైడే

కలసపాడు : మండలంలోని క్రైస్తవులు శుక్రవారం గుడ్‌ఫ్రైడేను ఘనంగా జరుపుకున్నారు. స్థానిక పరిపేతురు పరిపాలు చర్చి, పోరుమామిళ్లరోడ్డులోని ఆర్సీఎం చర్చి, చెన్నారెడ్డిపల్లె ఆర్సీఎం చర్చిలలో గురువారం రాత్రి క్రైస్తవులు ప్రార్థనలు చేశారు. శుక్రవారం పరిపేతురు పరిపాలు చర్చిలో ఫాదర్లు రెవ. ఆనంద్‌బాబు, ఆశిష్‌గాబ్రియేల్, ఆర్సీఎం చర్చిలో ఫాదర్ రెవ. కొత్తపల్లి మనోహర్, చెన్నారెడ్డిపల్లె ఆర్సీఎం చర్చిలో ఫాదర్ రెవ. ఈరిబాలస్వామి భక్తులకు దైవసందేశాన్ని అందించారు. వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విశ్వాసులు అంబేడ్కర్ విగ్రహం నుండి ఆర్సీఎం చర్చి వరకు శిలువను మోస్తూ దైవవాక్యాలు ప్రదర్శన చేశారు. 41 రోజులు నిష్టతో ఉపవాసాలు చేసి శుక్రవారంతో ముగియడంతో ఆదివారం ఈస్టర్ పండుగను ఘనంగా జరుపుకోనున్నారు. కార్యక్రమంలో బేబీ సరోజ, శ్రీనివాస్‌పాల్, రవిక్రీస్తుదారి, సలోమి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

పోరుమామిళ్ల : శాంతి సమాధానం, సమానత్వం, త్యాగం, క్షమ, ఓర్పు తదితర గుణాలను పెంపొందించేందుకు దేవుడు స్వయంగా చేసిన బలియాగమే శిలువ యాగమని పాస్టర్ పసుపుల అనిల్‌కుమార్ పేర్కొన్నారు. గుడ్‌ఫ్రైడే సందర్భంగా గిరినగర్‌లోని హోరేబు ప్రార్థన మందిరంలో అనిల్ సందేశమిచ్చారు. దేవుడు లోకాన్ని ఎంతో ప్రేమించారని, మానవులను రక్షించుటకు నిత్యనరకము నుండి తప్పించి, స్వర్గములో చేర్చడానికి చేసిన బలియాగమే శిలువ యాగమన్నారు.

ఘనంగా గుడ్‌ఫ్రైడే

కాశినాయన : మండలంలోని క్రైస్తవులు శుక్రవారం గుడ్‌ఫ్రైడే వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అమగంపల్లె గ్రామంలో యేసు వేషధారణలో శిలువను మోసుకుంటూ పురవీధుల్లో తిరిగారు. ఈ సందర్భంగా అమగంపల్లె విచారణ గురువులు దేవరాజు మాట్లాడుతూ క్రీస్తు లోకానికి మానవుల పాపపరిహారం కల్వరి శిలువలో మరణించారన్నారు. ఆయన జీవితకాలంలో పలికిన ముఖ్య వాక్యాలను వివరించారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.